# ఆషాఢ మేఘం



—శర్మ సి.హెచ్.

ఎప్పటిలాగానే ఆరోజు కూడా ఆఫీసు కెళ్ళ డానికి ఉదయం తొమ్మిదిన్నరకల్లా అప్సరా థియేటర్ సెంటర్లోని బస్టాపుకొచ్చి నిలబడ్డాను. అన్ని బస్సులూ వచ్చిపోతున్నాయి కాని, నాక్కావాలసిన బస్సు మాత్రం రావడం లేదు.

అసహనంగా వాచీవంక చూస్తుంటే పెద్ద శబ్దం చేసుకుంటూ ఇండ్ సుజుకీ మోటార్‌బైక్ వచ్చి బస్టాపులో ఆగింది. కళ్ళు జిగేల్‌మనిపిం చేలా వున్న ఓ నవ యవ్వని బైక్‌మీదినుంచి దిగి, దాన్ని నడుపుతున్న యువకుడిని చేతులూపుతూ సాగనంపింది. అప్పటికే బస్టాపులోని కొన్ని జతల కళ్ళు వాళ్ళిద్దరినీ శల్యపరీక్షలు చేసేశాయ్.

పింక్ కలర్ పేపర్ సిల్క్ శారీ, కూలింగ్ గ్లాసెస్ ధరించిన ఆమె మోడ్రన్ యువతిలా వున్నప్పటికీ, సంప్రదాయబద్ధంగా కాలివేళ్ళకు పిల్లేళ్ళు (మెట్టెలు) పెట్టుకోవడంతో బస్టాపులో దించివెళ్ళిన యువకుడు ఆ అమ్మాయి భర్త కాబోలు అనుకున్నాను. కానీ, ఈ మధ్య పెళ్ళికాని అమ్మాయిలు సైతం కాలివేళ్ళకు పిల్లేళ్ళు పెట్టుకోవడం పెద్ద ఫ్యాషన్‌గా మారడంతో ఆ అమ్మాయి అవివాహిత ఎందుకు కాకూడదు? అని నన్ను నేనే ప్రశ్నించుకున్నాను. ఇంతలో మరో యువకుడు స్కూటర్‌పై వచ్చి బస్టాపులో ఆగడం, ఆ అమ్మాయి నవ్వుతూ వెళ్ళి స్కూటర్ ఎక్కడం, ఆ వెనుకే నేనెక్కవలసిన బస్సు రావడం... అన్నీ క్షణాల్లో జరిగిపోయాయి.

ఆఫీసుకు వెళ్ళానే కాని నా మనసు మనసులో లేదు. బస్టాపులో కనిపించిన సుందరి తాలూకు ఆలోచనలు నా బుర్రను చెదపురుగుల్లా తొలిచేస్తున్నాయి. మొత్తానికి ఘటికురాలే! ఏకంగా ప్రేమ బండిని రెండు పట్టాలమీద నడిపిస్తున్నది! అని అనుకున్నాను.

మర్నాడు కూడా అదే సమయానికి ఆ సుందరి బస్టాపులో మళ్ళీ ప్రత్యక్షమయింది. ఈసారి మరో కొత్త వ్యక్తి కైనటిక్ హోండా మీద ఆ సుందరిని తీసుకొచ్చి బస్టాపులో వదిలివెళ్ళాడు.

"నిన్నటిదాకా ఇద్దరే! ఈరోజు ముగ్గురయ్యారన్నమాట! మన తెలుగు సినిమాల్లో హీరో ఒకడు, హీరోయిన్లు ఇద్దరు–ముగ్గురుంటుంటే, ఇక్కడ సీను దానికి పూర్తి రివర్స్‌లో వున్నట్టుందే" నాతో అన్నాడు నా పక్కనే నిలబడిన ఓ వ్యక్తి. ఆ మాటలు విన్న ఆ అమ్మాయి అతడివంక కొరకొరా చూసింది.

కొంతసేపటికి ముందురోజు వచ్చిన స్కూటర్‌వాలా రాగానే ఆమె ఆత్రుతగా అతడివెంట వెళ్ళిపోయింది.

వారం రోజులపాటు ప్రతి ఉదయమూ ఈ తంతు ఇలానే కొనసాగింది. దీంతో బస్టాపులో వాళ్ళని చూడ్డానికొచ్చేవారి సంఖ్య బస్సెక్కేవారి కంటే ఎక్కువైంది. కొందరు కొంటె కుర్రాళ్ళయితే ఆమెను రకరకాల కామెంట్స్‌తో టీజ్ చేయనారంభించారు.

ఎంతోమంది ఎన్నోరకాల ఈటెల్లాంటి మాటల్తో పొడుస్తుంటే సహనం కోల్పోయిన ఆమె ఓరోజు భోరున ఏడ్చేసింది. బస్టాపులో వున్న కొంతమంది ఆడవాళ్ళు ఆ అమ్మాయిని ఓదార్చడానికి చేసిన ప్రయత్నం విఫలమైంది. జనమంతా ఆమె చుట్టూ గుమిగూడారు. ఇంతలో స్కూటర్‌వాలా రానేవచ్చాడు. విషయం తెలుసుకున్న అతడు ఆగ్రహోదగ్రుడై బస్టాపులోని కుర్రాళ్ళతో ఘర్షణకి దిగాడు. ఆ సుందరి వెక్కివెక్కి ఏడుస్తూ ఆ స్కూటర్ వాలాని వారించింది.

ఆ పరిస్థితిలో ఆమెను చూశాక నా హృదయం ద్రవించింది. వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్‌కి ఫోన్‌చేసి చెప్పాను. పోలీసోళ్ళు వచ్చి లాఠీలతో జనాన్ని తరిమిగొట్టి అసలు విషయమేమిటని అక్కడున్న ప్యాసింజర్లని అడిగారు. ఆ అమ్మాయి తిరుగుబోతని, డబ్బున్న యువకులు స్కూటర్ ఆపగానే ఎక్కి వెళ్తుందని... ఇలా ఎవరికి తోచిన మాటలు వారు చెప్పారు. అందరూ అన్ని చెప్పినా నేను మాత్రం ఆ క్షణంలో మౌనమునిగా మారిపోయాను.

అందరి సాక్ష్యాలూ విన్న సబ్ ఇన్‌స్పెక్టర్ వారిద్దరిమీదా మండిపడుతూ "మీమీద న్యూసెన్స్ కేసు బుక్ చేస్తున్నాం.. జీపు ఎక్కండి" అన్నాడు గంభీరంగా.

అప్పుడు వారిద్దరూ చెప్పిన చేదు నిజాన్ని విని, అతడు పర్సులోంచి చూపించిన ఫొటోను చూసి పోలీసులతోపాటు బస్టాపులోని వారందరమూ అవాక్కయ్యాము. అంతకుమించి ఆశ్చర్యంలో మునిగిపోయాము.

పాపం! వారిద్దరూ కొత్తగా పెళ్ళయిన భార్యాభర్తలట. ఆషాఢమాసంలో అత్తవారింటి గడప తొక్కరాదనే ఆచారం వుండడంతో రోజూ ఉదయాన్నే ఆమె అన్నయ్యలు బస్టాపులో వదిలివెడుతుంటే, ఆమె భర్త వచ్చి పికప్ చేసుకుని వెళ్తున్నాడట. ఇందుకోసం ఇద్దరి ఇళ్ళకూ కేంద్రబిందువుగా వున్న అప్సరా సెంటర్ బస్టాప్‌ని ఎంచుకున్నారట.